క్లుప్తంగా

ఎకరాకు 26 బస్తాల దిగుబడి అంచనా..



వరిపొలంలో పంటకోత ప్రయోగం చేస్తున్న సిబ్బంది

రాజాం: మండలంలో బొడ్డవలస, లక్ష్మీపురం, నందబలగ, అమరాం, ఆగూరు తదితర గ్రామాల్లో పంటకోత ప్రయోగాలు చేపట్టినట్లు ఏఎస్ఓ బాలమోహన్, వ్యవసాయ అధికారి ఎ.రేణుకాసాయి తెలిపారు. అమరాంలో చేపట్టిన పంటకోత ప్రయోగాన్ని బుధవారం వారు పరిశీలించారు. ఎకరాకు 26 బస్తాల ధాన్యం దిగుబడి వస్తున్నట్లు అంచనా వేశారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని, వర్షాలకు పంట తడిచిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

స్త్రీ, పురుషులు ఇద్దరూ సమానమే..



రేగిడిలో వాల్‌పోస్టర్లు ప్రదర్శిస్తున్న ఎంపీడీఓ, సిబ్బంది

రేగిడి: మహిళలు ధైర్యంగా జీవించాలని ఎంపీడీఓ శ్యామలకుమారి అన్నారు. లింగ ఆధారిత వివక్ష వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా మండలంలో రేగిడి, ఆమదాలవలస గ్రామాల్లో బుధవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సమాజంలో స్త్రీ, పురుషులు ఇద్దరూ సమానమేనని, పురుషులతో పాటు స్త్రీలు అన్ని రంగాల్లో సమానంగా రాణిస్తున్నారన్నారు. మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం పి.గోవిందరావు, సీసీలు, వీఓలు, వీఓఏలు పాల్గొన్నారు.

మెప్మా బజార్ పరిశీలన



అర్బన్ బజార్‌ను పరిశీలిస్తున్న కమిషనర్, తదితరులు

రాజాం: స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో బుధవారం మహిళా సంఘాల ఆధ్వర్యంలో అర్బన్ బజార్ నిర్వహించారు. మహిళా సంఘాలు తయారుచేసిన క్రాఫ్ట్ వస్తువులు, వివిధ రకాల వంటకాలు, తినుబండారాలను అందులో విక్రయించారు. మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, మేనేజర్ నాగరాజు, టీఎంసీ ఎంవీ రత్నం తదితరులు బజార్‌ను పరిశీలించారు. మహిళా సంఘాల సభ్యులను అభినందించారు. ప్రతీ నెల ఈ అర్బన్ బజార్‌ను ఏర్పాటుచేయాలని నిర్వాహకులకు కమిషనర్ సూచించారు.

వైఎస్సార్ కళ్యాణమస్తు చెక్కు పంపిణీ



చెక్కు అందిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

రేగిడి: మండలంలో సోమరాజుపేట గ్రామ సచివాలయం వద్ద వైఎస్సార్ కళ్యాణమస్తు పథకం లబ్ధిదారులకు బుధవారం చెక్కులు పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ వావిలపల్లి జగన్మోహనరావు, ఎంపీడీఓ శ్యామలకుమారి, ఏపీఎం గోవిందరావు లబ్ధిదారులకు చెక్కు అందజేశారు. పథకం లబ్ధిని గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సవళాపురపు రమేష్‌నాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం, వ్యాయామంతో ఆరోగ్యం



మందుల వాడకంపై అవగాహన కల్పిస్తున్న ఫార్మసీ కళాశాల సిబ్బంది

బొబ్బిలి: మండలంలోని కోమటిపల్లిలో జాతీయ ఫార్మసీ వారోత్సవాలను బుధవారం నిర్వహించారు. ఫార్మసీ నిబంధనల ప్రకారం ఏయే మందులు ఎవరెవరు వేసుకోవాలి? వాటి ప్రయోజనాలు, దుష్పరిణామాలను భాస్కర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థులు, ప్రొఫెసర్లు గ్రామస్తులకు వివరించారు. అనంతరం వైద్య పరీక్షలు చేశారు. సమతుల పౌష్టికాహారం తీసుకోవడం, రెగ్యులర్‌గా వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవచ్చన్నారు. కార్యక్రమంలో చైర్మన్ తూముల భాస్కరరావు, కరస్పాండెంట్ టీఎస్ఎస్ కార్తీక్, ప్రిన్సిపాల్ డాక్టర్ కొణతాల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి



బొబ్బిలి: గొల్లపల్లిలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



రాజాం: కొండకవీధిలో పి.శ్రీనివాసరావు ఇంటి వద్ద రాత్రిబస చేసిన ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు, తదితరులు

బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల పరిధిలోని అన్ని మండలాల్లో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం ఉత్సవంలా కొనసాగుతోంది. వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి రాష్ట్రానికి జగనే ముఖ్యమంత్రిగా ఎందుకు కావాలో వివరిస్తున్నారు. సంక్షేమ పథకాల లబ్ధిని తెలియజేసేలా సచివాలయాల వద్ద డిజిటల్ బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు. రాజాం పట్టణంలో లచ్చయ్యపేట-2 సచివాలయం పరిధి కొండకవీధిలో జరిగిన కార్యక్రమంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు పాల్గొన్నారు. వివిధ ప్రజా సంఘాల నాయకులతో సమావేశమై సీఎం జగన్ చేస్తున్న అభివృద్ధిని వివరించారు. పల్లె నిద్రలో భాగంగా గ్రామానికి చెందిన పిచ్చుక శ్రీనివాసరావు ఇంట్లో రాత్రిబస చేశారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



రేగిడి: అంబఖండిలో సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న వైస్ ఎంపీపీ అచ్చెన్నాయుడు, జగన్మోహనరావు, తదితరులు



రాజాం: కొండకవీధిలో పార్టీ జెండాను ఎగురవేస్తున్న వైఎస్సార్‌సీపీ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, తదితరులు



మెంటాడ: కొండలింగాలవలసలో డిజిటల్ ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, తదితరులు



బొబ్బిలి: చిత్రకోట బొడ్డవలసలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ శంబంగి లక్ష్మీవేణుగోపాలనాయుడు, తదితరులు



బాడంగి: బొత్సవానివలసలో రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలో ప్రజలకు వివరిస్తున్న జీసీఎస్ కన్వీనర్ శంకరరావు, పార్టీ నాయకులు



రామభద్రపురం: కొండకెంగువ సచివాలయం వద్ద సంక్షేమ బోర్డు ఆవిష్కరిస్తున్న నాయుకులు, అధికారులు



బొబ్బిలి: పట్టణంలోని 7వ సచివాలయం వద్ద సంక్షేమ పథకాల డాష్‌బోర్డును ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణారావు, రమేష్‌నాయుడు, తదితరులు



సంతకవిటి: గరికిపాడులో సంక్షేమ లబ్ధిని తెలిపే డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న సర్పంచ్ యడ్ల రామకృష్ణ, పార్టీ నాయకులు



రాజాం సిటీ: గార్రాజుచీపురుపల్లిలో డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ రూరల్ కన్వీనర్ రాజగోపాలనాయుడు, తదితరులు

మత్తుకు బానిసైతే జీవితాలు నాశనం



మాట్లాడుతున్న ఏఎస్పీ వెంకటరావు

బొబ్బిలి: నిషేధిత మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వైపు యువత ఆకర్షితులు కావద్దని, వాటి వినియోగం, రవాణా ఎక్కడ జరిగినా అధికారులకు, 14500 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని ఎస్ఈబీ ఏఎస్పీ ఎస్.వెంకటరావు, అసిస్టెంట్ కలెక్టర్ బి.సహదిత్ వెంకట త్రివినాగ్ అన్నారు. స్థానిక ట్రిపుల్ ఎస్ డిగ్రీ కాలేజ్‌లో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మత్తు పదార్థాల వినియోగం వలన శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా, సమాజికంగా ఏవిధంగా నష్టపోతామో విద్యార్థులకు వివరించారు. అనంతరం పట్టణంలోని పలు కూడళ్ల మీదుగా ర్యాలీ నిర్వహించారు. సీఐ ఆర్.శ్రైభీమ్, కాలేజ్ వ్యవస్థాపకులు రౌతు రామ్మూర్తినాయుడు, కరస్పాండెంట్ రౌతు వాసుదేవరావు, ప్రిన్సిపాల్ రెడ్డి మోహనరావు, అధ్యాపకులు, ఎస్ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి రికార్డులను అప్‌డేట్ చేయాలి



ఉపాధిహామీ రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ అంజనేయులు

బాడంగి: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకానికి సంబంధించిన ఏడు రిజిస్టర్లతో పాటు పంచాయతీల్లో నిర్వహిస్తున్న ఎంసీసీ రికార్డులను ఎప్పటికప్పుడు ఆధునీకరించుకోవాలని ఎంపీడీఓ అంజనేయులు అన్నారు. స్థానిక ఉపాధిహామీ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. రికార్డుల నిర్వహణ, అప్‌డేషన్‌పై ఆరాతీశారు. పనులు ప్రతిపాదించినప్పుడే నాణ్యతపరమైన అంశాలను దృష్టిలో పెట్టుకుని అంచనాలు రూపొందించాలన్నారు. ఏసీ బుజ్జి మాట్లాడుతూ.. ఉపాధి పని కావాలని కోరిన వెంటనే పనులు కల్పించడం జరుగుతుందన్నారు. ఆర్ఎఫ్ఆర్ పట్టాలున్న రైతులకు 150 రోజుల వరకు పని కల్పిస్తామన్నారు.

రక్తహీనత నివారణే లక్ష్యం

రామభద్రపురం: రక్తహీనత లేని రాష్ట్రంగా తయారు చేయడమే ప్రభుత్వం లక్ష్యమని వైద్యాధికారి దిలీప్ కుమార్ అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం రక్తపరీక్షలు చేశారు. రక్తహీనతతో బాధపడుతున్న వారితో ఐరన్ మాత్రలు మింగించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. విద్యార్థులు ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని, క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. బాలికల్లో రక్తహీనత నిర్మూలనకు ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుంటోందన్నారు.

రక్తహీనతతో బాధపడేవారిని గుర్తించి సరైన పోషకాహారం, ఐరన్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం కె.కామేశ్వరరావు, హెల్త్ సూపర్‌వైజర్ వాసుదేవరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

రాజాం సిటీ: మండలంలో గురవాం గ్రామానికి చెందిన సారంపాటి తిరుపతి అనే యువకుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుని కుటుంబానికి అతని స్నేహితులు, గ్రామ యువకులు, సింగుపురం ఫ్రెండ్స్ యూత్ అంతా కలిసి రూ.50 వేలు ఆర్థిక సాయాన్ని బుధవారం అందజేశారు. తిరుపతిరావు పిల్లల పేరుమీద ఈ నగదును ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలని కుటుంబ సభ్యులను కోరారు.

సక్రమంగా నిధులు ఖర్చుచేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

తెర్లాం: రాష్ట్ర ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమం కింద తెర్లాం మండలానికి మంజూరు చేసిన ఫేజ్-2 నిధులను సక్రమంగా వినియోగించాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నాడు-నేడు ఫేజ్-2 కింద ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. ఆ నిధులతో చేపట్టాల్సిన పనులపై చర్చించారు. నిధుల వినియోగంపై, పనుల నాణ్యతపై పేరెంట్స్ కమిటీలు, ఇంజినీరింగ్ సిబ్బంది అవగాహన పెంపొందించుకోవాలని, పారదర్శకంగా పనులు చేపట్టాలని సూచించారు. సమావేశంలో సీడీపీఓ రాజ్యలక్ష్మి, ఏఈ కిశోర్, ఏఓ డీవీ అప్పారావు, సూపర్‌వైజర్లు ఉషారాణి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

యోగా పోటీలకు జీఎంఆర్ఐటీ విద్యార్థులు





యోగా పోటీలకు ఎంపికైన విద్యార్థులు

రాజాం సిటీ: డిసెంబర్ 1 నుంచి మూడు రోజుల పాటు చెన్నై అన్నా యూనివర్సిటీలో జరుగనున్న అంతర్ విశ్వవిద్యాలయాల యోగా పోటీలకు స్థానిక జీఎంఆర్ ఐటీ విద్యార్థులు ఎంపికయ్యారు. కళాశాలలో చదువుతున్న కె.లీలరమ్యసాయి, డి.లావణ్యలహరి విజయనగరం జెఎన్‌టీయూజీవీ తరఫున ఈ పోటీలకు ఎంపికైనట్లు పీడీ డాక్టర్ బి.అరుణ్‌కుమార్ బుధవారం తెలిపారు. వారిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్, ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్, స్టూడెంట్ ఎఫైర్స్ డీన్ డాక్టర్ వి.రాంబాబు, తదితరులు అభినందించారు.

అయ్యప్పకు అభిషేకాలు

రేగిడి: మండలంలో అంబఖండి గ్రామంలో వెలసిన అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు రేజేటి సత్తిబాబుశర్మ, తులసీకృష్ణశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. అలాగే చాటాయివలస గ్రామంలో మాజీ ఎంపీటీసీ ఈసర్ల అప్పలరాం ఇంటి వద్ద అంబులం పూజ నిర్వహించారు. వెయ్యి మంది భక్తులకు ప్రసాదాన్ని అందించారు.

ఘనంగా అంబులం పూజ

రాజాం: పట్టణంలో సత్యనారాయణపురం తెలగవీధిలో అయ్యప్పస్వామి అంబులం పూజ బుధవారం ఘనంగా జరిగింది. గురుస్వాములు బలివాడ కృష్ణమూర్తి, ఎ.హరిశర్మ ఆధ్వర్యంలో పొన్నాడ సురేష్ ఈ పూజా కార్యక్రమం నిర్వహించారు. అయ్యప్పస్వామికి విశేష పూజలు చేపట్టారు. రాజాం పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చోడి సాగుపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీ శ్యాంసుందర్

బొబ్బిలి: చోడి(రాగులు) సాగుపై రైతులు అవగాహన పెంపొందించుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీ మజ్జి శ్యాంసుందర్ అన్నారు. మండలంలోని అలజంగి రైతుభరోసా కేంద్రంలో బుధవారం రైతులకు రబీలో చోడిపంట సాగు, ఖరీఫ్‌లో పండించిన ధాన్యం విక్రయాలపై అవగాహన కల్పించారు. పంటకు మద్దతు ధరతో పాటు హమాలీ, గోనె సంచులు, రవాణా వంటి ఖర్చులను ఏవిధంగా పొందవచ్చో వివరించారు. వీఏఏలు పెంట లత, వేణుగోపాల్ పాల్గొన్నారు.

మధురమైనది తెలుగు భాష

రాజాం సిటీ: రెండువేల ఏళ్ల చరిత్ర కలిగిన తెలుగు భాషా సాహిత్యం ఎంతో మధురమైనవని రాజాం రచయితల వేదిక అధ్యక్షుడు గార రంగనాథం అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల సముదాయంలో బుధవారం తెలుగు భాషా బోధకులకు నూతన బోధనా పద్ధతులను వివరించారు. విద్యార్థులకు ప్రాచీన సాహిత్యంలోని గొప్పతనాన్ని వివరించాలని కోరారు. అనంతరం రంగనాథంను భాషోపాధ్యాయులు సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బొంతు మాధురీలత, సముదాయ కార్యదర్శి వాండ్రంగి గౌరీకుమార్, పాండ్రంకి శ్రీనివాసరావు, వల్లూరి దాలినాయుడు, వావిలపల్లి ఇందిర, రాజాం, సంతకవిటి మండలాల తెలుగు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై ప్రచారం



అవగాహన కల్పిస్తున్న అధికారులు

రాజాం సిటీ: మండలంలో మారేడుబాక గ్రామంలో 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర' బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై ఎంపీడీఓ బాసూరీ శంకరరావు, పలుశాఖల అధికారులు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అర్హులంతా ఆయా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్ పాల్గొన్నారు.

స్త్రీ నిధి ద్వారా రూ.200 కోట్ల రుణాలు

- డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి



మాట్లాడుతున్న పీడీ కల్యాణ చక్రవర్తి

బొబ్బిలి: జిల్లాలో ఉన్న 40,600కు పైగా డ్వాక్రా సంఘాలు, 4.50లక్షల మంది డ్వాక్రా మహిళలకు ఈ ఏడాది రూ.1100కోట్ల బ్యాంకు లింకేజీ, రూ.200 కోట్ల స్త్రీనిధి రుణాలు ఇవ్వగా వారు సక్రమంగా చెల్లిస్తున్నారని డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణ చక్రవర్తి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన మండల సమాఖ్యల వారీగా సంఘాలు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ మహిళా సంఘాలు సక్రమంగా చెల్లింపులు చేస్తుండడంతో బ్యాంకర్లు రుణ పరిమితిని పెంచుతున్నారని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 40,600మంది డ్వాక్రామహిళలకు రుణ పరిమితి ద్వారా అందిన మొత్తంతో వివిధ వనరుల ఉత్పత్తి యూనిట్లు పెట్టించడం కోసం చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వ్యక్తిగత రుణాల స్థానే యూనిట్ల స్థాపన వలన ఆర్థిక పురోగతి లభిస్తుందన్న విషయాన్ని తెలియజేస్తూ చైతన్యం చేసేందుకు ప్రయత్నిస్తున్నామని పీడీ తెలిపారు. సమీక్షలో ఏపీడీ కె.సావిత్రి, డీపీఎం జె.లక్ష్మునాయుడు, ఏరియా కోఆర్డినేటర్ బి.రవికుమార్, స్త్రీ నిధి ఏజీఎం ఉమామహేశ్వర రావు, ఏపీఎం పి.శ్రీనివాసరావు, పక్కి భాగ్యలక్ష్మి, ఎ.రత్నకుమార్, వీఓఏలు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

చురుగ్గా అభివృద్ధి పనులు



బాడంగి ఎస్సీ కాలనీలో సీసీరోడ్డు నిర్మాణం

బాడంగి: మండలంలోని 16 సచివాలయాల పరిధిలో 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ద్వారా కేటాయించిన నిధులతో 65 పనులు మంజూరైనట్లు పంచాయతీరాజ్ జేఈ రమేష్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. తొలి విడతగా 12 సచివాలయాల పరిధిలో 45 పనులు మంజూరు కాగా, వాటిలో 31 పనులు పూర్తియినట్లు చెప్పారు. రెండో విడతలో 4 సచివాలయాల పరిధిలో మంజూరైన 20 పనులను ప్రస్తుతం చేపడుతున్నట్లు చెప్పారు. బాడంగి-2 సచివాలయంలో రూ.20 లక్షలతో సీసీరోడ్లు, కాలువలు నిర్మించామన్నారు. కోడూరు-1,2 సచివాలయాల పరిధిలో, గజరాయునివలసలో పనుల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షలు చొప్పున నిధులు మంజూరు చేసింది.

మహిళా సంఘాలన్నీ గ్రేడ్-ఏలో ఉండాలి

- డీఆర్‌డీఏ పీడీ ఎ.కళ్యాణచక్రవర్తి



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ కళ్యాణచక్రవర్తి

రాజాం: మహిళా సంఘాలన్నీ ఏ గ్రేడ్‌లో ఉండాలని, ఆ మేరకు వైఎస్సార్ క్రాంతి పథంలోని ప్రతీ ఒక్క ఉద్యోగి కృషిచేయాలని డీఆర్‌డీఏ జిల్లా పీడీ ఎ.కళ్యాణచక్రవర్తి అన్నారు. రాజాం వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద తెర్లాం, వంగర, రాజాం మండలాల వైకేపీ సీసీలు, వీఓఏలతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ సంఘ సమావేశాలకు వైకేపీ సిబ్బంది తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. స్త్రీనిధి, ఉన్నతి, సీఐఎఫ్ రుణాలు సభ్యులందరికీ మంజూరు చేయడంతో పాటు వాటిని తిరిగి సకాలంలో రికవరీ చేయాలన్నారు. నిధుల దుర్వినియోగం చేసిన సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతీ గ్రామ సంఘం పరిధిలో కనీసం ఇద్దరు సభ్యులకు పీఎంఈజీపీ రుణాలు మంజూరు చేసి, వారితో స్వయం ఉపాధి పరిశ్రమలు నెలకొల్పేలా చేయాలని, వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని సూచించారు. ఆడిట్‌లకు సహకరించాలని, మహాజన సభలు, గ్రామైఖ్య సంఘ ఎన్నికలు సకాలంలో పూర్తిచేయాలన్నారు. అంతర్గత ఆడిట్‌లో గుర్తించిన లోపాలను తక్షణమే సరిచేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైకేపీ ఏపీడీ సావిత్రి, ఏసీ ఎ.చిరంజీవి, స్త్రీనిధి ఏజీఎం ఉమామహేశ్వరరావు, ఫైనాన్స్ డీపీఎం లక్ష్మునాయుడు, ఏపీఎంలు ఎన్.అప్పలనాయుడు, కె.హేమలత, దధికుమార్, చక్రపాణి, మోహన్, సుధాకర్, శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్, డిగ్రీ కళాశాల భవనాలు నిర్మించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగభూషణం

రాజాం సిటీ: రాజాంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలకు సొంత భవనాలు నిర్మించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.సునీల్, ఎస్.నాగభూషణం డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఐటీఐ కళాశాల వద్ద బుధవారం రాజాం నియోజకవర్గ ఏఐఎస్ఎఫ్ సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలకు సొంత భవనాలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని గుర్తుచేశారు. అనంతరం విద్యార్థులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై మాట్లాడారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ బి.దుర్గాప్రసాద్, జగదీష్, రామారావు, సతీష్ పాల్గొన్నారు.

2న దాసాంజనేయ విగ్రహ ప్రతిష్ట

రాజాం: పట్టణంలో సత్యనారాయణపురం తెలగవీధిలో డిసెంబర్ 2న దాసాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త చెలికాన బదిరీ సత్యనారాయణ, ఆలయ నిర్వాహకులు గంధవరపు చినవెంకటరావు బుధవారం తెలిపారు. శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణవేంకటేశ్వరస్వామి ఆలయంలో దాసాంజనేయ స్వామి విగ్రహాన్ని ఏర్పాటుచేసినట్లు వెల్లడించారు. ఆలయ ప్రధాన అర్చకులు భట్టరు శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో పెద్ద ఎత్తున పూజలు, వాస్తు హోమం, మూలామంత్ర హవనం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.